అమ్మణ్ణి చీర

బి.సి. దేవి

"అంతా ఆ అమ్మణ్ణి అనుగ్రహం కదండీ! కాకపోతే అస్సలు ప్రమోషనే వద్దని మొండిపట్టు పట్టి కూర్చున్న మీరు బుద్ధిపుట్టి ఆ పరీక్ష పాసుకావడమేమిటి, పాసైన పది రోజుల్లోనే ఆఫీసరుగా ప్రమోషన్ రావడమేమిటి, నచ్చిన డిపార్టుమెంట్లోనే పోస్టింగు కావడమేమిటి! పోయిన సారి ఇక్కడికొచ్చినప్పుడు మొక్కుకున్నాను ఆ తల్లే మీ మనసు మార్చాలని అందరిలా మీరూ ఆఫీసరు కావాలని. సత్యంగల తల్లి నా కోరిక నెరవేర్చింది. ఇప్పుడైనా నమ్మండి మొక్కుబళ్ళు వూరికే పోవని." పెన్న ఇసుకలో నడుస్తూ చెపుతోంది దుర్గ.

చిరునవ్వుతో ఊఁ కొడుతూ పక్కనే నడుస్తున్నాడు అప్పారావు. పచ్చని పొలాలమీంచి వీచే స్వచ్ఛమైన/గాలి. పాదాలని మెత్తగా తాకుతోన్న లేత ఇసిక. దక్షిణపు వేపు అల్లంత దూరంలో నరసింహస్వామి కొండ. కొండమీద కోవెల. కనుచీకటి పడుతోంది. కొండ మీద లైట్లు వెలిగాయి. అవతలి గట్టున కామాక్షి గుడి. దుర్గకేసి చూశాడు. ప్లాస్టిక్ బుట్ట చేతబట్టుకుని పక్కనే నడుస్తోంది బరువుగా. ఆమె ముఖంలో ఎంత తృప్తి. పెన్నగాలికి ఆవిడ తల్లో మల్లెలు మరింత గుబాళిస్తున్నాయి. ప్లాస్టిక్ బుట్టలో కొబ్బరికాయ, పూల దండ, కర్పూరం పొట్లాలు, అరటిపళ్ళు, భద్రంగా పాక్ చేసిన అట్టపెట్టెలో మూడొందలు చేసే కంచిపట్టు చీర - జొన్నవాడ కామాక్షికి.

"ఏమిటాలోచిస్తున్నారు? చేతులూపుకుంటూ నడవకపోతే ఈ బుట్ట కాస్త పట్టుకోకూడదూ" అంటూ భర్త చేతికి బుట్ట అందించి చెప్పుల్లోకి జారబడిన ఇసుకని విదిల్చింది దుర్గ. ఏటిగాలికి ఎగిరెగిరిపడే పమిటని నడుం చుట్టూ బిగించింది. నిజమే. తను ఆఫీసరవుతానని ఎన్నడూ అనుకోలేదు అప్పారావు. అస్సలు ఈ పరీక్షలూ ప్రమోషన్లూ అంటేనే ఎలెర్జీ తనకి. ఈ భూమ్మీద పుట్టాము గనక బతకాలి.

బతకాలి గనక ఏదో వుద్యోగం వెలగ బెట్టాలి అనే తత్వం అప్పారావుది. అంతకు మించి వుద్యోగంతో ఇంకే సంబంధమూ పెంచుకోలేదు అతను. ఆఫీసులో అంటీ అంటనట్టు తామరాకు మీది నీటిబొట్టులా మసలుకునేవాడు. అందరూ డి. ఎ. ఇంక్రిమెంట్ల గురించి, సీనియారిటీ గురించి, ప్రమోషన్ల గురించి చర్చించుకుంటో వుంటే అప్పా రావు మాత్రం లంచ్ అవర్లో తన సీట్లో కూర్చుని ఏ పత్రికో పుస్తకమో చదువు కునేవాడు. పదేళ్ళ సర్వీసులో అత నెప్పుడూ ప్రమోషన్ గురించి ఆలో చించింది లేదు. ప్రమోషన్ ప్రమోషన్ అని అంగలారుస్తారుగాని అందులోని ఇబ్బందుల్ని గురించి ఇంట్లో ఆడాళ్ళ కేమి తెలుస్తుంది. ప్రమోషన్తోబాటు బాధ్యత పెరుగుతుంది. పని బరువు ఎక్కువౌతుంది. కిందివాడికీ, పైవాడికీ కూడా సమాధానం చెప్పుకోవాలి. రెండేళ్ళకీ, మూడేళ్ళకి పై వూళ్ళకి ట్రాన్స్ఫర్లు. అసలు ప్రమోషన్ అనేదే లేకపోతేనే హాయిగా వుంటుంది అని కూడా అనుకునేవాడు అప్పారావు.

అప్పారావు స్వతహాగా భావుకుడు. హైస్కూల్లో చదివే రోజుల్లోనే చిన్న చిన్న మినీ కథలు రాయటం ప్రారం భించాడు. కాలేజీకొచ్చేసరికి పెద్ద కథల స్థాయికి ఎదిగాడు. ఉద్యోగంలో చేరే నాటికి రెండు సీరియల్ నవలలు, రెండు ప్రముఖ వారపత్రికల్లో ధారావాహికంగా వస్తున్నాయి. రచనావ్యాసంగం మించి అతని దృష్టి సినిమావైపు మళ్ళింది. ఆఫీసుకి నెల్రోజులు సెలవుపెడేసి పూనా వెళ్ళి 'ఫిలిం ఎప్రిసియేషన్ కోర్సు' చదివేడు. సినిమా మీడియం గురించి ఎంతో చదివి తెలుసుకున్నాడు. ఫిలిం సొసైటీల్లో సభ్యుడిగా చేరి మంచి మంచి ఫిలిం క్లాసిక్సు చూశాడు. సింపోజియం లలోనూ, సెమినార్లలోనూ పాల్గొని భేష్ అనిపించుకున్నాడు. తనీ వుద్యో గానికి తగడనీ, న్యాయంగా తను మృణాల్ సెన్ అంతటివాడు అయివుండా ల్సిందనీ అనుకుంటూ వుండేవాడు అప్పారావు. అటువంటి తనకి ప్రమో షన్ వచ్చి ఆఫీసరయ్యాడూ అంటే అది దుర్గ చేసుకున్న పుణ్యమో, కంచి పట్టుచీర మహత్యమో అయివుండాలి అనుకున్నాడు. కదిలే బస్సులో ఎక్క డానికే భయపడే తను, మూలపేటలో ఆ డొక్కు బస్సధిరోహించి, టాపుమీద కూర్చుని అడ్డొచ్చే చెట్టుకొమ్మల్ని అవ లీలగా తప్పించుకుంటూ జొన్నవాడకి ప్రయాణం చెయ్యటం ఎంత ప్లెజెంట్ థ్రిల్లింగు! చుట్టూ పచ్చని పంటచేలు. దూరంగా కొండ. తిక్కన పుట్టిన తెలుగు నేల. బస్సుతోబాటు దారిపొడుగునా పరుగెట్టే నెల్లూరు చెరువుగట్టు. గట్టు మించి కట్టెమోపుల్ని నెత్తిమీదుంచుకుని నడిచే పల్లెపడుచుల వయ్యారపు నడకలు.

ఎంత మధురమైన అనుభవం! తెల్లని ఇసుకలో పాయలై పారుతోంది పెన్న. మణికట్టులోతు నీళ్ళలో చీరకుచ్చెళ్ళు పైకెత్తిపట్టుకుని నడుస్తోంది దుర్గ.

"ఇంకోంచెం అటువేపుకి వెళ్దాం పద" అన్నాడు అప్పారావు.

"ఎందుకు ?" అంది దుర్గ.

"పెన్నలో మునగాలని వుంది నాకు. చూడు నీళ్లెంత నిర్మలంగా, చల్లగా వున్నాయో."

"నే రానుబాబూ. నీళ్ళంటే భయం నాకు. అంత సరదాగా వుంటే మీ రెళ్ళి మునిగేసి రండి."అంటూ ఇసుకలో కూల బడింది దుర్గ.

మొలలోతు నీళ్ళలో దిగాడు అప్పారావు. చిన్నతనానెప్పుడో నేర్చుకున్న ఈతను జ్ఞప్తిచేసుకుని కాసేపు జలకాలాడేడు.

"నువ్వూ రారాదూ. ఎంత హాయిగా వుందో ప్రాణానికి" అని పిలిచాడు భార్యని.

"రానంటూ వుంటే వినిపించుకోరేం. మీరూ రండి త్వరగా. మునిగింది చాలు. అవతల గుడికి ఆలశ్యమవుతోంది. ఇదుగో మరీ లోతుకు వెళ్ళకండి. సుడి గుండా లుంటాయి." అంటూ అరిచింది దుర్గ.

చిన్నప్పటి సంఘటన మనసులో కదిలింది. అప్పుడు దుర్గకి పదేళ్ళు. వేణుగోపాలస్వామి గుడిలో తెప్ప తిరణాళ్ళు జరుగుతోంది. తెప్ప కడుతుంటే చూడ్డానికి వెళ్ళింది. మెట్లమీద కాలు జారింది. కోనేటిలో పడి పోయింది బుడుంగుమని. తనతోబాటే వచ్చిన పక్కింటబ్బాయి - తనకన్న రెండేళ్ళు పెద్దవాడు - చెంగున వంగి నీటిమీద పరుచుకున్న తన జుట్టు పట్టుకుని చాకచక్యంగా గుంజి పైకిలాగాడు. అతనే తనపక్కన లేకపోతే తనేమైపోయేదో! నీళ్ళలోంచి బయటికొచ్చాడు అప్పారావు. తువ్వాలుతో భర్త వీపు తుడిచింది దుర్గ. పాయగా పారే నీళ్ళని దోసిళ్ళకెత్తుకుని ముఖం కడుక్కుంది.

ఏరుదాటి గుడికి చేరుకునేసరికి చీకటి పడింది. నెల్లూరు ఆడపడుచుల చక్కదనంతో కళకళ లాడిపోతోంది గుడి ఆవరణ. మగవాళ్ళకంటే మగువలే ఎక్కువగా కనబడుతున్నారు గుళ్ళో. జారిపోతున్న పమిటెలు, పెన్న నీటితో తడిసిన రవికెలు, పొంగువారే యవ్వనపు సోయగాలు, జడల్లో గుబాళించే మల్లెల పరిమళాలు. ఒక్కక్షణం చలించింది అప్పారావు మనసు.

"ఒసే కామాక్షీ! కొట్టకే. నే వెళ్ళిపోతానే.... అమ్మనాయనోయ్! నన్ను చంపేస్తున్నాదిరోయ్ .." అని అరుస్తూ, ఏడుస్తూ, తిడుతూ, శపిస్తూ పిచ్చిగా నవ్వుతూ గుడిచుట్టూ పరుగుతీసే ఆడదయ్యాలు- తలలు విరబోసుకుని తడి దుస్తుల్లో బహిర్గతమయ్యే వయసు

వొంపుల్ని, అవయవసౌష్ఠవాల్ని అనాలోచితంగా ప్రదర్శిస్తూ ప్రదక్షిణాలు చేసే ఆడవాళ్ళ-చేతిని చిన్నగా గిల్లింది దుర్గ.

"తప్పండీ వాళ్ళ నలా చూడకూడదు. పదండి క్యూలో నిలబడదాం."

బుద్ధిమంతునిలా భార్య ననుసరించాడు అప్పారావు.

గర్భగుడిలో అమ్మణ్ణి హారతిలిస్తూ చెమటలు కారుస్తున్నాడు పూజారి. జాలేసింది అప్పారావుకి. ఒకప్పుడు హారతి పళ్లెంలో డబ్బులు వేయటాన్ని అసహ్యించుకునేవాడు అతను. అంతకంటె రిక్షావాడికి మరో పది పైస లెక్కువిస్తే అసలైన పుణ్యం అని వాదించేవాడు. కాని ఇప్పుడు వూపిరాడని ఆ చీకటి కొట్లో కర్పూరపు పొగల సెగలు పీలుస్తూ ధారగా చెమటలుకక్కే పూజరినిచూస్తూ "పాపం ఎంత కష్టమో" అనుకున్నాడు.

క్యూ మెల్లగా కదిలింది. వరుసలో తనకు ముందున్న పల్లెపడుచు చాలా అందంగా కనిపించింది. నలుపైనా ముఖం కళగా వుంది. ఆమె చంకలోని పాప అప్పారావుని చూసి బోసినవ్వులు విరజిమ్ముతోంది. ముచ్చటేసింది అప్పారావుకి. ఆ పాప తల్లి దృష్టి నాకర్షించాలని చిలిపి కోరిక కలిగింది. పాప బుగ్గని గిల్లి "ఏం పేరు పాపా?" అన్నాడు చనువుగా. 'గయ్' మని ఏడుపు లంకించుకుంది ఆ పాప. క్యూలో ముందుకి కదలబోయిన పాప తల్లి చివుక్కున వెనక్కి తిరిగి అప్పారావుని గుర్రుగా చూసింది. విరిసీవిరియని అప్పారావు పెదాలమీది చిరునవ్వు క్షణంలో మాడిపోయింది. 'శాస్తి బాగా జరిగిందా?' అన్నట్లు భర్తకేసి చూసి నవ్వింది దుర్గ.

అర్ధగంట గడిచాక గర్భగుడి వాకిట్లో అమ్మణ్ణి కెదురుగా నిలబడ్డారు అప్పారావు దంపతులు. పూజాసామగ్రితోబాటు పట్టుచీర కూడా అందించింది దుర్గ పూజారి చేతికి.

"రసీదు?" అడిగాడు పూజారి.

దేవాలయం ఆఫీసులో చీర చదివింపుకు డబ్బుకట్టి పుచ్చుకున్న రసీదుని పర్సులోంచి తీసి పళ్ళెంలో పెట్టింది దుర్గ.

పేరూ గోత్రమూ అడిగాడు పూజారి.

భర్తవేపు సిగ్గుపడుతూ చూసి "చెప్పండి" అన్నది దుర్గ.

"నువ్వే చెప్పరాదూ" అన్నాడు అప్పారావు తనూ సిగ్గుపడిపోతూ.

"త్వరగా చెప్పండమ్మా" చిరాకు పడ్డాడు పూజారి. భర్తపేరూ, గోత్రమూ చెప్పింది దుర్గ.

హారతి పళ్ళెంతో అమ్మణ్ణి దగ్గరికి నడిచాడు పూజారి.

"ఆ చీరని ఏంచేస్తారు? పూజారి తీసేసుకుంటాడా తరువాత?" అడిగాడు భార్యని అప్పారావు.

భలేవారే! "అపచారం కదండీ. అమ్మణ్ణి వూరుకుంటదా? నెలకోసారి దేవికి వచ్చిన చీరలన్నీ దేవస్థానం వాళ్ళు వేలంపాట పాడి అమ్మేస్తారు. అందుకేగా మనకు రసీదిచ్చింది చీర చదివించినట్టు."

లోపల గర్భగుడిలో అమ్మణ్ణికి పసుపురంగు పట్టుచీర చుట్టబెడుతున్నాడు పూజారి. ఏవరో గంట మ్రోగిస్తున్నారు. పూజారికి కళ్ళు చెమర్చినయ్. ఒక్క క్షణం దేవి విగ్రహం మసక మసగ్గా కనిపించింది. కళ్ళని కమ్ముకున్న నీటి తెరల్లోంచి పాతస్మృతులు అలలై చెల రేగాయి.

గర్భగుడి శోభనం గదిలా మారి పోయింది.

అలనాడు, పదేళ్ళకిందట, అద్దేరంగు పట్టుచీరతో దేవిరూపంలో తన జీవితం లోకి అడుగుపెట్టిన ఇల్లాలు మీనాక్షి కళ్ళలో మెదిలింది. ఆ తరువాత మళ్ళీ ఇన్నేళ్ల కాలంలో భార్యకి పట్టుచీరకాదు ఒక మంచి నూలు చీరైనా కొనివ్వలేక పోయాడు తను.... పెరిగే ధరలు_ ఎదిగే సంతానం....నడినెత్తిమీది దారిద్ర్యంతో బాటు నానాటికీ క్షీణించే మీనాక్షి ఆరోగ్యం.

వారం దినాలుగా చిరుగుల చీరలో పరువు దాచుకుంటూ పెచ్చులూడిపోయిన గదిలోంచి బయటికి రావటంలేదు మీనాక్షి.

రెండు మాసిన చీరల్ని ఏటిగట్టుకు తీసుకుపోయింది, పుతికి ఆరేసుకోవ టానికి వారం రోజుల్నాడు. వరదలై పొంగిన పెన్న వున్న ఆ రెండు చీరల్నీ లాక్కుపోయింది. మిగిలిన ఒక్క

చిరుగుల చీరలోనే ముణగదీసుకుని పడుకుంటోంది రోజా.

పూజ ముగిసింది. ప్రదక్షిణలు చేసి, కొబ్బరిముక్కలు కొట్టుకు తిని బయటపడేసరికి గంట తొమ్మిది దాటింది.

నెల్లూరు వెళ్ళే ఆఖరు బస్సు వెళ్ళిపోయింది.

"ఇప్పుడెలా ?" బిక్కమొహం వేశాడు అప్పారావు.

"ఈ రాత్రికి గుళ్ళోనే పడుకుందామండీ." అంది దుర్గ, బస్సు మిస్సయినందుకు ఏమాత్రం కంగారుపడకుండా.

అదిరిపడ్డాడు అప్పారావు.

ఇల్లు వదిలి ఇలా ఆరుబయట ఎప్పుడూ జాగారంచేసిన అనుభవం లేదు అతనికి. ఇంటికంటె గుడి పదిలం అంటోంది భార్య.

"ఈ రోజు శుక్రవారం. అమ్మణ్ణికి పవిత్రమైన దినం. ఈ రాత్రికి ఇక్కడే పడుకుని తెల్లారగట్ల లేచి వెళ్ళిపోతారు జనం. లోపల కావాల్సినంత స్థలం వుంది. హాయిగా పెన్నగాలి పీలుస్తూ నిద్రపోవచ్చు. మన ల్నీవేళ తన దగ్గర విలిపేసుకోవా లనుకుంది కామాక్షితల్లి. ఈ గుళ్ళో ఒకరోజు నిద్రచేయటం చాలా మంచిది. రండి." అంటూ భర్తని బరబరా లాక్కుపోయింది దుర్గ.

అక్కడ గర్భగుడికీ ప్రాకారానికీ మధ్య ఖాళీస్థలంలో గచ్చు నేలమీద చాపలు, దుప్పట్లు, చీరకొంగులు పరిచి పడగ్గదుల్లో భర్తల సరసన ప్రవ్వళించినంత స్వేచ్ఛగా పడుకునివున్న ఆడపడుచుల్ని చూసి విస్మయంతోబాటు చూడ వేడుకగా అనిపించింది అప్పారావుకి.

దేవస్థానం వాచ్ మెన్ ని మంచి చేసుకుని ఎట్టాగో ఓ తుంగచాప సంపాయించి తెచ్చింది దుర్గ. బాగా గాలివచ్చే ప్రదేశం చూసి చాప పరిచింది. అరటిపళ్ళు, కొబ్బరిముక్కలతో కడుపు నింపుకుని పెన్న నీళ్ళు తాగి పడుకున్నారు ఇద్దరూ. అయిదు నిమిషాలు నడుం వాల్చిందో లేదో లేచి కూర్చుంది దుర్గ.

"అమ్మణ్ణికి పల్లకీసేవ జరుగుతోన్నట్టుంది. కాసేపు వెళ్ళి చూసొద్దాం రండి." అంది దుర్గ.

"నాకు ఓపిక లేదు. కాళ్ళు పీకుతున్నాయి. కావాలంటే నువ్వెళ్ళిచూడు." అంటూ ఇటు పక్కకి తిరిగాడు అప్పారావు.

"బుట్ట భద్రం.అలాగే నిద్రపోయేరు. ఓ అర్ధగంటలో వచ్చేస్తాను" అని లేచి వెళ్ళింది.

దుర్గ తిరిగి వచ్చేసరికి అప్పారావు నిజంగానే నిద్రపోతున్నాడు.

గుళ్ళో సందడి తగ్గింది. వుండి వుండీ ఎవరో పదాలుపాడటం వినిపిస్తోంది. కొంచెం దూరంలో పడుకున్న మోతుబరి రైతు ఆ యేడు మిరపపంటను గురించి ఇంకెవరితోనో వివరించి చెబుతున్నాడు.

"నువ్వెన్నయినా చెప్పన్నా: అడ



పిల్లకి అంత మిడిసిపాటు పనికిరాదు. దాని షోకులేమో, దాని కులుకులేమో, అదసలు సంసారపక్షం పిల్ల కాదనుకో." ఇంకెవరో పెద్దమనిషితో కోడలుపిల్ల మీద అక్కసుని వెళ్ళబోసుకుంటోంది ఒకావిడ. కనకమహల్లో ఆడే కొత్త సినిమా కబుర్లు చెప్పుకుంటున్నారు ఇద్దరమ్మాయిలు.

పెన్నమీంచి వీచే చల్లని గాలి కెరటాలకి మాగన్నుగా కునుకుపడుతోంది దుర్గకి. ప్లాస్టిక్ బుట్టని తలకిందికి తీసుకుని కళ్ళుమూసుకుంది.

గర్భగుడిలో అమ్మణ్ణికి వస్త్రాపహరణం జరుగుతోంది. చీరల కంట్రాక్టరు దేవి చీరల్ని బరబరా లాగేస్తున్నాడు. ఏ భగవానుడూ అమ్మణ్ణిని ఆదుకోవటానికి ముందుకు రావటంలేదు. గుడి ముందు అరుగుమీద అమ్మణ్ణి చీరల్ని కుప్పపోసి వేలంపాట పాడుతున్నారు. అప్పారావు ఈ ఘోరాన్ని చూడలేక పోతున్నాడు. చీర లాలిచే దుశ్శాసనుని మీదికి లంఘించాడు. ఒక్క తోపు తోశాడు అప్పారావుని చీరల కంట్రాక్టరు. తూలి దేవి పాదాలమీద పడ్డాడు అప్పారావు. చిరునవ్వుతో దేవి అతడ్ని దగ్గరకి తీసుకుంటోంది.... ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు అప్పారావు. అప్పుడే ఇటువేపుకి తిరిగిన దుర్గ అతని భుజాల మీద చేతులేసి దగ్గరగా జరిగింది.

ఆ రోజుకి అన్ని సేవలూ పూర్తిచేసుకుని దేవిని పసుపురంగు పట్టుచీరలో బంధించి, గర్భగుడి తలుపులకి తాళాలు బిగించి పూజారి ఇంటికి బైలుదేరే వేళకి గంట పదకొండు కావచ్చింది. భర్తకాళ్ళకి నీళ్ళందివ్వటానికి నీరసంగా లేవబోయింది మీనాక్షి. అవసరంలేదని

చేత్తోనేసంజ్ఞచేసి, కాళ్ళు కడుక్కొని వచ్చి అయిదు నిమిషాల్లో భోజనం అయిందని పించేడు పూజారి. పిల్లలు నలుగురూ అరుబయట అరుగుమీదే పడుకుని నిద్ర పోతున్నారు.

చిరుగుల చీరలో ముడంకెవేసి పడుకున్న భార్యని ఒకసారి చూసి పక్కనే గోడకి జార్లబడి కూర్చున్నాడు పూజారి.

గర్భగుడి చీకట్లో పట్టుచీరలో నించునే నిద్రపోతున్న అమ్మణ్ణి! తన సరసన చిరుగుల మాసికల్లో మీనాక్షి!

అమ్మణ్ణికి పసుపురంగు పట్టు వస్త్రం సింగారిస్తున్నాడు–

"అబ్బ! వుండండి. చీర నలిగి పోదూ!"

"పోనీ ఇలాంటివి–పది కొని పెట్టనూ"

"ఈ రంగు మీకు నచ్చిందా?"

"నీ ఒంటి రంగులో కలిసిపోయింది."

"అంటే బాగులేదనా?"

"కాదు. నీ అంత అందంగా వుందని."

"ఛీ! పొండి"......

మీనాక్షిలో అమ్మణ్ణి కనిపిస్తోంది!

గర్భగుళ్ళో దేవిరూపంలో మీనాక్షి సాక్షాత్కరించింది.

సర్వం శక్తిమయం.

దేవీ మీనాక్షి.

నీరసంగా మూలిగి ఇటుపక్కకి తిరిగింది మీనాక్షి. పైటచెంగు చిరుగుల్లోంచి పల్చబడిన వక్షస్థలం పేలవంగా కనిపించింది. మోకాళ్ళని కడుపులోకి లాక్కొని ముణగదీసుకుని పడుకుంది.

గంట పన్నెండు దాటింది.

పెచ్చులూడిపోయిన ఆ గదిలో కాసేపు అటూ ఇటూ తచ్చాడాడు. గోడకి తగిలించిన తాళాలు చేతికి తీసుకున్నాడు. గడికేసి నడిచాడు పూజారి. భక్తులంతా గుడిప్రాంగణంలో అలసి సొలసి నిద్ర పోతున్నారు. వాళ్ళని దాటి గర్భగుడికేసి నడిచాడు. తలుపులు తెరిచి ఒక్కక్షణం దేవిముందు నిలబడ్డాడు.

జాలిగా చూసింది దేవి.

గుండె రాయి చేసుకున్నాడు. గబగబా అమ్మణ్ణిచీర లాగేశాడు. నగ్నంగా దర్శన మివ్వలేదు దేవి. లోపల మరో నూలుచీర, దానిమీద మల్లెలసరాలు అమ్మణ్ణిని కావిలించుకుని వున్నాయి– తృప్తిగా నిట్టూర్చాడు పూజారి. మళ్ళీ తాళాలు బిగించి ఇల్లు చేరుకున్నాడు.

చిరుగు మాసికల చీరలో మానాన్ని కాపాడుకుంటూనే ఆదమరచి నిద్ర పోతున్న భార్యమీద పసుపురంగు పట్టు చీరని పదిలంగా కప్పాడు. పక్కనే మేనువాల్చి మృదువుగా భార్యచేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

అమ్మణ్ణిలాగే దర్శనమిస్తోంది అతనికి మీనాక్షి.

———